## బొత్సకు జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి- హుకుంపేట: విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, బొత్స ఝాన్సీ దంపతులను విజయనగరంలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశామని అల్లూరి సీతారామరాజు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ సురేష్ కుమార్ ఆదివారం పేర్కొన్నారు. సురేష్ మీడియాతో మాట్లాడుతూ, ఏజెన్సీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల సమస్యలను విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఆయన అన్నారు.

శుభాకాంక్షలు తెలుపుతున్న సురేష్‌కుమార్

# ఏజెన్సీలో అంగన్వాడీల అగచాట్లు

## -సమస్యలు పరిష్కరించని ప్రభుత్వం -నేడు అల్లూరి జిల్లా కేంద్రంలో 36 గంటల ధర్నా

ప్రజాశక్తి -పాడేరు: ఏజెన్సీలో అంగన్‌వాడీలు పలు సమస్యలతో సతమతం అవుతున్నారు. సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు ఆందోళన చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పిలుపు మేరకు..పాడేరు ఏజెన్సీలోని అన్ని మండలాల అంగన్వాడి వర్కర్లు ఈనెల 10, 11 సోమ, మంగళవారాల్లో 36 గంటలు ( పగలు, రాత్రి) అల్లూరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం చేపడుతున్నారు. ఐసిడిఎస్ పరిరక్షణ, అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ అమలు తదితర సమస్యలపై అంగన్వాడీలు కొన్నేళ్లుగా నిరంతర పోరాటం సాగిస్తూనే ఉన్నారు. గత 48 ఏళ్ల నుంచి గర్భిణీలకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అనేక సేవలందిస్తున్న అంగన్వాడీలకు కనీసం ఉద్యోగభద్రత కల్పించకపోవడంపై ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత కోర్కెల దినం సందర్భంగా ఈనెల 10,11 తేదీలలో 36 గంటల పాటు ధర్నా చేపట్టాలని రాష్ట్ర కమిటి నిర్ణయించింది. ఈ మేరకు చేపడుతున్న ధర్నాలో జిల్లాలోని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా కమిటీ పిలుపునిచ్చింది.

**అంగన్వాడీల ప్రధాన డిమాండ్స్ :**

అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలి. ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలి. రిటైర్మెంట్ బెనిఫిట్ 5 లక్షలు, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలి. హెల్పర్ల ప్రమోషన్లకు వయో పరిమితి 50 సంవత్సరాలకు పెంచాలి. ప్రమోషన్లో రాజకీయ జోక్యం అరికట్టాలి. 300 జనాబా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి. వర్కర్లతో సమానంగా వేతనాలు, మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలి. వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలి. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలి. 2017 నుండి పెండింగ్లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలి. సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, భీమా అమలు చేయాలి. సెంటర్లలో మౌలిక వసతులు కల్పించి, సీనియారిటీ ప్రకారం వేతనాలు ఇవ్వాలి. సూపర్ వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలి.

**సమస్యల వలయంలో అంగన్వాడీలు**

పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ఎన్నో వ్యయ ప్రయాసలు, అవస్థల నడుమ విధులు నిర్వర్తిస్తున్నారు గిరిజన ప్రాంతంలో భౌగోళికంగా ఎన్నో ఇబ్బందులు ఉన్నాయి. మారుమూల ప్రాంతాల్లో ఎగువన కొండలపై చాలా అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. అంగన్వాడి కేంద్రాల వరకు సరుకులు చేరవు. సొంత ఖర్చుతో అంగన్వాడి వర్కర్లే వాటిని బైకులపై మోయుంచుకొని తీసుకొని వెళ్లాల్సిన వస్తోంది. అంగన్వాడి కేంద్రాలకు గుడ్లు కుళ్ళినవి, చిన్నవి సరఫరా చేస్తున్నారు.కరోనా తర్వాత అంగన్వాడీలకు టీఏ, డీఏలు ఇవ్వలేదు. ఏజెన్సీలో అంగన్వాడి వర్కర్లు పని ఒత్తిడిని ఎక్కువగా ఎదుర్కొంటున్నారు.

పాడేరులో ధర్నా చేపడుతున్న అంగన్‌వాడీలు (ఫైల్ ఫొటో)

### సమస్యలు పరిష్కరించాలి

గిరిజన ప్రాంతంలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలి. అంగన్వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలి. టీఏ, డీఏలు సకాలంలో ఇవ్వాలి. వర్కర్లపై పని ఒత్తిడిని తగ్గించాలి.ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు ఐక్యంగా కదిలి రావాలి. పోరాడి తమ సమస్యల్ని హక్కుల్ని సాధించుకోవాలి.

**వి.ఉమామహేశ్వరరావు**
**సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి**

### ఉద్యోగ భద్రత కల్పించాలి

ఐసిడిఎస్ పరిరక్షణ, అంగన్వాడి ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు వంటి సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదు. అంగన్వాడీ వర్కర్లకు జీతాలు సరి పోలేదు. పని ఒత్తిడి పెరింది. సీఎం జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్రలో అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. నాలుగేళ్లుఅవుతున్నా సమస్యలు పరిష్కారం చేయలేదు. ఇప్పటికైనా సిఎం స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

**కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ,**
**జిల్లా ప్రధాన కార్యదర్శి ,**
**ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్**

భూములు పరిశీలిస్తున్న సురేంద్ర, నాయకులు

## ఆదివాసీల భూముల జోలికొస్తే ఖబడ్దార్

### - ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి-అనంతగిరి:విజయనగరం రాజులు గిరిజనుల భూములు . వందలాది ఎకరాలు స్వాధీనం చేసుకోవడం కోసం ప్రయత్నం చేస్తే సహించేది లేదని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో. సురేంద్ర హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు. బాలదేవ్, సీపీఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు. టోకూరు సర్పంచ్ కిల్లో. మొస్యలతో కలిసి సురేంద్ర ఆదివారం అనంతగిరి మండలం అనంతగిరి, టోకూరు, ఎగువుశోభ, కొండిబ పంచాయితీల పరిధిలోని కొత్తవలస, ఎక్టగూడ, అనంతగిరి, మొండిజాముగుడ, బికంబవలస, రాయివల, ముమ్వంవలస, డముకులో నెలకొన్న భూ సమస్య పై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, తాత మూత్తాతల కాలం నుండి సాగు చేస్తూ జీవనం సాగిస్తునామని, ఈ మద్యకాలంలో సంబందం లేని వ్యక్తులు తమ భూములపై కన్నేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నతరం సురేంద్ర మాట్లాడుతూ, మండలంలోని అనంతగిరి, కొండిభ, టోకురు, ఎగువసోభ పంచాయితీ పరిధిలోని గ్రామాల్లో సుమారు 318 ఎకరాల భూమిపై విజయనగరం రాజులు కన్నేసి, ఈ భూమిపై సుప్రీంకోర్టులో కేసు వేశారన్నారు. కోర్టు తీర్పుతో జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు మండల రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సర్వే చేసి రాజుల భూములు గుర్తించాలని ఉత్తర్వులు ఇచ్చి ఆదివాసులు ముత్తాతాల కాలం నుండి సాగు చేస్తున్న జిరాయితి, బంజరు, కొండపోడు భూములు స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. కొండపోడు పట్టాలు ఆదివాసి రైతులకు గతంలో మంజూరు చేశారన్నారు. ఆదివాసుల భూరక్షణకు 1959 భూరక్షణ చట్టం, 1970 లో భూ బదలాయింపు 1/70 చట్టం, పీసా చట్టం, అటవీ హక్కుల చట్టం అమలుల్లో ఉండగా విజయనగరం రాజులకు ఆదివాసీల సాగులో ఉన్న భూములు ఎలా చెందుతాయని ప్రశ్నించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం, అల్లూరి జిల్లా కలెక్టర్ స్పందించి విజయనగరం రాజులు చేస్తున్న రాచరిక చేష్టలను ఆపాలన్నారు. ఐదవ షెడ్యూల్ ఏరియా ఆదివాసి రక్షణ చట్టాలను అమలు చేసి ఆదివాసులు సాగు చేస్తున్న భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు సొమ్మెల ఆనందరావు, కొర్ర .అప్పన్న, శాంతి, ఎస్.గంగులు పాల్గొన్నారు.

# క్షణికావేశంతోనే.. తుపాకీ తూటాకు యువకుడు బలి

### -పోలీసుల వెల్లడి

ప్రజాశక్తి-పాడేరు:క్షణికావేశంతోనే గిరిజన యువకుడు కొండపల్లి కొండలరావు తన నాటు తుపాకీతో మెడ వద్ద కాల్చుకొని ప్రాణాలు బలి తీసుకున్నాడని పాడేరు పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధాకర్, సబ్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్ వెల్లడించారు. మండలంలోని దేవాపురం పంచాయతీ ఢీకొత్తూరు గ్రామంలో శుక్రవారం రాత్రి తుపాకీ తూటాకు గిరిజన యువకుడు కొండపల్లి కొండలరావు బలైన సంగతి విధితమే. ఈ సంఘటనపై అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పాడేరు పోలీసులు విలేకరుల సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ సంఘటనపై శనివారం గ్రామానికి వెళ్లి పరిశీలించి గ్రామస్తుల ద్వారా వివరాలు సహకరించినట్లు తెలిపారు. హతుడు కొండలరావు శుక్రవారం మధ్యాహ్నం సుమారు మూడు గంటలకు ఢీకొత్తూరు గ్రామానికి కొంత దూరంలో ఉన్న కొండపై చీపురు మొక్కలు నాటడానికి వెళ్ళాడని, అదే సమయంలో ఇదే గ్రామానికి చెందిన కొండపల్లి లక్ష్మి మేకలను తోలుకొని వెళుతుంది. కొండలరావు నాటుతున్న మొక్కలను మేకలు వేయడంతో ఇద్దరి మధ్యన ఘర్షణ జరిగిందని తెలిపారు. తరువాత అదే రోజు సాయంత్రం కొండపల్లి లక్ష్మి గ్రామంలో అందరి వద్దకు వెళ్లి కొండలరావు తనను చెయ్యి పట్టుకొని లాగి బలాత్కారం చేయబోయాడని, ఈ విషయమై గ్రామంలో రచ్చబండ వద్దకు సమావేశానికి రావాలని చెప్పింది. ఈ విషయం కొండలరావు తెలుసుకొని రాత్రి 10 గంటల సమయంలో తన వద్ద ఉన్న నాటు తుపాకీ పట్టుకొని లక్ష్మీ ఇంటి వద్ద కు వెళ్లి తనపై ఊరందరికీ చెప్పి పరువు తీస్తున్నావని ఆమెతోనూ, ఆమె భర్త రామకృష్ణ తోను గొడవపడ్డాడని, తన నాటు తుపాకీతో మెడ వద్ద కాల్చుకొని చనిపోయాడని వారు స్పష్టం చేశారు. కొండలరావును లక్ష్మీ ఆమె భర్త రామకృష్ణ కలిసి తుపాకీతో కాల్చి చంపి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ కొండలరావు కుటుంబ సభ్యులు తమకు ఫిర్యాదు చేశారని, దీనిపై అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఈ కేసుకు సంబంధించి తాము ఎవరిని అదుపులోకి తీసుకోలేదని వెల్లడించారు.

నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు

## ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అరకువేలి మండలం ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన మండల అధ్యక్షుడుగా పూజారి కృష్ణ, కార్యదర్శిగా సోడపల్లి ఐసుబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వంతల మూర్తి, కాకరి కొండమ్మ, సిరాగం చరణ్, సహాయ కార్యదర్శిగా పి.సరెంద్ర, వంతాల బలరాం, కుమ్మిడి శాంతితో పాటు 12 మంది మండల కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ ఎస్ గంగమ్మ, అరకు వేలి గర్ల్స్ కన్వీనర్ కె.ధనలక్ష్మి మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేయాలని అన్నారు. అరకువేలి ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో పూర్తిస్థాయిలో అధ్యాపకులను నియమించి, మహిళ వసతిగృహంలో ప్రహరీ గోడ నిర్మించాలన్నారు. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు, హెల్త్ అసిస్టెంట్ నియమించాలన్నారు. పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు అందించాలని డిమాండ్ చేశారు.

అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

## హక్కులు, చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి- అనంతగిరి:బాలల హక్కులు, చట్టాల పై విద్యార్థులకు బాలల హక్కుల పరిరక్షణ వేదిక నియోజకవర్గ ప్రతినిధులు అవగాహన కల్పించారు. ఆదివారం మండలంలోని కొత్తవలస ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో బాలురు బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు హక్కులు, చట్టాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై వివరించారు. ఈ సందర్భంగా కన్వీనర్ డాక్టర్ లవకుశ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమ శిక్షణతో మెలిగనప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. నెలకు రెండు సార్లు పాఠశాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పాఠశాల వార్డెన్ ని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వార్డెన్ ధర్మ, డ్రాయింగ్ మాస్టర్ భాస్కరరావు పాల్గొన్నారు.

# అంగన్వాడీ దీక్షలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- చింతూరు : అంగన్వాడీల సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సిఐటియు నేతలు పూనెం సత్యనారాయణ, పొడియం లక్ష్మణ్ విమర్శించారు సమస్యల పరిష్కారానికి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 10,11తేదీల్లో చేపట్టే 36గంటల దీక్షను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, ఐసిడిఎస్‌కు నిధులు పెంచకుండా. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు. అంగన్వాడీ కార్మికులకు ఉద్యోగభద్రత లేకుండా పోయిందని, కనీస వేతనాలు అమలు జరగడం లేదన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గ్రాట్యూటీ చెల్లించడం లేదని ఆరోపించారు.

పాదయాత్రలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి నాలుగు న్నరేళ్లవుతున్నా ముఖ్యమంత్రి జగన్ అమలు చేయడం లేదని మండిపడ్డారు. సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్, ఐటిడిఎ కార్యాలయాల వద్ద చేపట్టే దీక్షలను జయప్రదం చేయాల న్నారు. సమావేశంలో అంగన్వాడీల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సున్నం రంగమ్మ, రాజేశ్వరి, అన్నపూర్ణ, ముత్తమ్మ, అజ్జమ్మ.పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అంగన్వాడీ, సిఐటియు నేతలు

# ధారాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

ధారాలమ్మ ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

ప్రజాశక్తి -సీలేరు: దారకొండ ఘాట్ రోడ్‌లో వెలసిన ధారాలమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ధారాలమ్మకు పూజలు నిర్వహించినా, మొక్కుబడులు తీర్చుకున్నా కోరిన కోర్కెలు తీరుతాయని విశ్వాసంతో ఆంధ్రా, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల నుంచి సొంతవాహనాల్లోనూ, బస్సుల్లోనూ అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ధారాలమ్మ ఆలయం కిటకిటలాడింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కుబడులు తీర్చుకున్న భక్తులు ఆలయ ప్రాంగణంలోనే వంటావార్పు చేసి సహఫంక్తి భోజనాలు చేశారు.

**అరకొర సౌకర్యాలతో భక్తుల అసహనం**

నిత్యం అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చే ధారాలమ్మ ఆలయం వద్ద అరకొర

### అరకొర సౌకర్యాలతో అవస్థలు

### పార్కింగ్ సౌకర్యం లేక ట్రాఫిక్‌కు ఇక్కట్లు

సౌకర్యాలు మాత్రమే ఉండడంతో భక్తులు అవస్థలు పడడంతోపాటు అసహనం వ్యక్తం చేశారు. స్థానిక ఏజెన్సీ వాసులే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల నుంచి అధికసంఖ్యలో వచ్చే భక్తులకు ధారలమ్మ ఆలయం వద్ద విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కనీసస్థాయిలో కూడాలేవు. నీటి సౌకర్యం కూడాఅంతంత మాత్రమే. ధారలమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు పరీక్ష పెడుతున్నట్లు ఆరుబయటే ఎండావానల్లో వంటలు,అక్కడే భోజనాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ధారాలమ్మ దర్శనానికి భారీగా వస్తున్న భక్తులతో అమ్మవారి ఆలయానికి అధిక ఆదాయం వస్తున్నప్పటికీ దేవాదాయ శాఖ అధికారులు భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం చూపుతున్నారనే చెప్పాలి. సినీ నటుడు బాలకృష్ణ సమకూర్చిన విశ్రాంత భవనం ఒకటే తప్ప మరి ఇతర భవనాలు ప్రభుత్వపరంగా చేపట్టిన పరిస్థితి లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ధారాలమ్మ దర్శనానికి వచ్చే భక్తుల తాకిడికి తగ్గట్టుగా ఇక్కడ సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. మరోవైపు ఆదివారం ధారాలమ్మ దర్శనానికి సొంత వాహనాల్లో వచ్చిన భక్తులు పార్కింగ్ సౌకర్యం లేక రోడ్డుకు ఇరువైపులా నిలిపేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

రోడ్డుకు ఇరువైపులా నిలిపిన వాహనాలు

## నేడు పలు అభివృద్ధి పనులు ప్రారంభం

పజాశక్తి- కొయ్యూరు : మండలంలోని పలుగ్రామాల్లో నూతన భవనాలను ఈనెల 10న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రారంభిస్తారని ఎంపిడిఒ లాలం సీతయ్య తెలిపారు. సోమవారం ఉదయం బూదరాళ్ల నూతన గ్రామ సచివాలయ భవనం, అంతాడ, బంగారంపేట-1 సచివాలయం పరిధిలోని వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభిస్తారన్నారు.

మధ్యాహ్నం రెండు గంటలకు బూదరాళ్ల సచివాలయం పరిధిలోని బూదరాళ్ళ, బూదరాళ్ల కొత్తూరు, సింగారం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు. గైర్హాజరైన వారి వివరాలను జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని హెచ్చరించారు.

# అర్హులకు సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి- కూనవరం : అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ అనంతబాబు అన్నారు. ఆదివారం కూనవరంలో నిర్వహించిన సభలో మాట్లాడుతూ, ప్రజాసమస్యల పరిష్కారమయ్యేలా చూడాలని నేతలకు చెప్పేవాడినన్నారు. ముంపు బాధితులు, పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గతేడాది వరదల సమయంలో పరిశీలనకు వచ్చిన ముఖ్యమంత్రికి ఇక్కడ సమస్యలను విన్నవించానని, నిర్వాసితులకు న్యాయం చేసేందుకు సిఎం హామీనిచ్చారన్నారు. ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ కాపర్ డామ్‌తో ఐదేళ్లుగా ముంపు మండలాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. అవినీతి రహితంగా రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించేందుకు వైసిపి ప్రభుత్వంచ ర్యలు తీసుకుంటోందన్నారు .వాలంటీర్ వ్యవస్థద్వారా లబ్ధిదారుల వాలంటీర్ వ్యవస్థ వల్ల లబ్ధిదారుల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంతబాబు

## నిందితునికి నీరాజనాలు దుర్మార్గం

ప్రజాశక్తి -చింతూరు : పోలీసు వ్యవస్థ వైసిపి అనుబంధ సంఘంగా మారిందనిబిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పాయం వెంకయ్య, మండల అధ్యక్షులు డివిఎస్ఎన్ రమణారెడ్డి ఆక్షేపించారు. హత్యకేసులో నిందితుడు ఎమ్మెల్సీ అనంతబాబు సభకు నిబంధనలు పాటించకుండా అనుమతులివ్వడంతోపాటు, చట్టం విలువలను తుంగలో తొక్కి భద్రత కల్పించారని ఆదివారం ప్రకటనలో ఆరోపించారు. ఆదివాసీ, దళితులకు అండగా ఉండి రక్షణ కల్పించాల్సిన గిరిజన ఎమ్మెల్యే ఎన్.ధనలక్ష్మి, వాటిని పక్కన పెట్టేసి, హత్యకేసులో నిందితుడైన ఎమ్మెల్సీ అనంతబాబుకు వంత పాడుతూ గిరిజన జాతికి ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. దీనికి తగు మూల్యం చెల్లించక తప్పదని, రానున్న ఎన్నికల్లో పోటీచేస్తే, ధనలక్ష్మికి డిపాజిట్ గల్లంతు కావడం ఖాయమన్నారు. నిందితుడి బహిరంగ సభకు అనుమతులిస్తూ, తమ నాయకులను నిర్బంధించడం హేయమైన చర్య అని ఆరోపించారు.

## పోలీసుల విస్తృత వాహన తనిఖీలు

ప్రజాశక్తి -సీలేరు: సీలేరులోని ఎపి జెన్‌కో చెక్‌పోస్టు వద్ద ఆదివారం స్థానిక ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక, సిఆర్‌పిఎఫ్ పోలీసులు ప్రత్యేక నిఘాపెట్టి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎపిజెన్‌కో చెక్‌పోస్టువద్ద ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేసి, వారి వద్ద నుంచి వివరాలను తెలుసుకుని నిర్ధారించుకున్నాకే విడిచిపెట్టారు. అలాగే సీలేరు వారపుసంతలోనూ, పరిసర ప్రాంతాల్లో ముఖ్య కూడళ్లలో తనిఖీలు చేపట్టారు అనుమానిత వ్యక్తులు, వస్తువులపైనే నిఘా పెట్టి, తనిఖీలు చేశారు. గంజాయి అక్రమ రవాణాపై దృష్టి పెట్టి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ సీలేరు పరిసర ప్రాంతాల్లో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని, గంజాయి అక్రమ రవాణా,ఇతర అసాంఘిక చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు..

వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఊరులో చెత్తను సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు

## వేతనాలు అందక పారిశుధ్య కార్మికుల అవస్థలు

**ప్రజాశక్తి- పెదబయలు రూరల్:**మండలంలో సీతగుంట మేజరు పంచాయతీలో గ్రామ పంచాయతీ, సచివాలయంలో సుమారుగా పది మంది పంచాయతీ పారిశుద్ధ కార్మికులు పని చేస్తున్నారు. వీరికి గత మూడు నెలల నుండి గౌరవ వేతనాలు చెల్లించలేదు. దీంతో పస్తులతో పని చేయవలసి వస్తుందని ట్రాక్టర్ డ్రైవర్ సోమేష్ విలేకర్ల ముందు తన ఆవేదన వ్యక్తం చేశారు.గౌరవ వేతనం చెల్లించకపోవడంతో పిల్లల పోషణకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా అధికార్లు స్పందించి బాకాయి జీతాలు చెల్లించాలని పారిశుధ్య కార్మికులు కోరారు.

## బోటు బోల్తా : మత్స్యకారులు సురక్షితం

**ప్రజాశక్తి- భీమునిపట్నం :** సముద్రంలో వేటకు వెళ్తుండగా అలల ధాటికి బోటు బోల్తా పడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. సంబంధిత మత్స్యకారులు అందించిన వివరాల ప్రకారం.. జివిఎంసి మూడో వార్డు బోయివీధికి చెందిన మత్స్యకారులు కదిరి అప్పలరాజు, కాసరపు దుర్గారావు, కొక్కిరి కాశీడు, కె.పెంటరాజుతో పాటు మరో నలుగురు ఆదివారం తెల్లవారుజామున వేటకు వెళ్లారు. ఈ క్రమంలో అలల ధాటికి బోటు బోల్తా పడింది. సముద్రంలో పడిన 8 మంది మత్స్యకారులు ఈదుకుంటూ ఒడ్డుకు చేరారు. తెప్ప, ఇంజను దెబ్బతిన్నాయి. 2 వలలు సముద్రంలో కొట్టుకు పోయాయి. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం జరిగిందని తెప్ప యజమాని కదిరి అప్పలరాజు వాపోయారు. ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని మత్స్యకార నాయకులు కదిరి ఎల్లాజీ కోరారు.

## ఆరో రోజుకు 'గంగవరం' దీక్షలు

**ప్రజాశక్తి -గాజువాక :** కనీస వేతనం కోసం అదాని గంగవరం పోర్టు కార్మికులు చేపట్టిన దీక్షలు ఆదివారం నాటికి ఆరో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలనుద్దేశించి సిపిఎం స్టీల్ జోన్ కార్యదర్శి శ్రీనివాస్‌రాజు మాట్లాడుతూ, కార్మికుల పట్ల అదాని గంగవరం పోర్టు యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. గంగవరం పోర్టులో చట్టాలు అమలు చేయడం లేదని, ప్రశ్నించిన కార్మికులపై చార్జిషీట్లు, మెమోలు ఇచ్చి భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు. గంగవరం పోర్టు నిర్మాణంలో తమ ఇళ్లు, భూములు త్యాగం చేసిని నిర్వాసితులకు పేరుకే పర్మినెంట్ ఉద్యోగాలని, కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు చెల్లిస్తున్నారని తెలిపారు. అదాని గంగవరం పోర్టులో ఉద్యోగ విరమణ పొందిన పోలీసు ఉన్నతాధికారులను నియమించి పోలీసుల అండదండలతో కార్మికుల పైనా, కార్మిక సంఘాలపైనా యాజమాన్యం నిర్బంధాలకు పూనుకుంటుందన్నారు.

సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ, అక్రమంగా తొలగించిన కార్మికుల విధుల్లో తీసుకోవాలని, కనీస వేతనం రూ.36 వేలు, బేసిక్ రూ.22 వేలుతో కలిపి డిఎ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ పోరాటాన్ని అణిచివేయాలని చూస్తే సిఐటియు చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ నాయకులు సత్యనారాయణ, ఎల్లేటి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ఒడిశాలో 'అప్పన్న క్షేత్రం మహత్యం' ముద్రణ

**ప్రజాశక్తి-సింహాచలం:** సింహాచల దేవస్థానం క్షేత్ర మహత్యాన్ని తెలియజేసే పుస్తకాన్ని డిపి రామచంద్రాచార్యులు తెలుగులో రచించిన పుస్తకాన్ని ఒడిశాలో అనువదించి దాసుడు బాబు భక్తుడు సాయికుమార్ సహాయంతో ముద్రించిన పుస్తకాన్ని ఆదివారం దేవస్థానం ఇఒ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షేత్ర మహత్యం పుస్తకాన్ని ఒడిశాలో అనువదించడం వల్ల ఒడిశా భక్తులకు అప్పన్న ఆలయంలో జరిగే విశేషాలు, క్షేత్ర విశేషాలు విపులంగా తెలుస్తాయన్నారు. ఈ పుస్తకం ఒడిశా భక్తులకు ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ఈ పుస్తకావిష్కరణలో ఎఇఒలు భ్రమరాంబ, రమణమూర్తి, పర్యవేక్షకులు సునీల్ ఎఇ హరిరాజు తదితరులు పాల్గొన్నారు.

# డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

### వైద్య ఆరోగ్య సంచాలకులు రామిరెడ్డి

ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

**ప్రజాశక్తి -పాడేరు:** పాడేరు కేంద్రంలో ఆదివారం డెంగీ నివారణ మాసోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య సంచాలకులు డాక్టర్ వి.రామిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఐటీడీఏ నుండి పాత బస్టాండు అంబేద్కర్ కూడలి వరకు సాగింది. దోమతెరలు వాడండి, దోమ కాటు నుండి రక్షణ పొందండి, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే పాటించండి, పరిసరాల పరిశుభ్రత పాటిద్దాం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ వి.రామిరెడ్డి మాట్లాడుతూ, ఎపిడిమిక్ సీజన్ ప్రారంభమైనందున దోమలతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. రెండో విడత పిచికారిని ఈనెల 31 వరకు చేపడుతున్నామని ఆయన చెప్పారు. డెంగ్యూ వ్యాధి నిర్ధారణకు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వైయస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్ల వద్ద నిర్ధారణ కిట్లను అందుబాటులో ఉంచామని చెప్పారు. నీరు నిల్వ ఉన్న కాలువలు, దోమలు పెరిగే ప్రదేశాలను గుర్తించి ఏఎన్ఎంలు యాప్ ద్వారా సచివాలయం సెక్రటరీకి పంపించి నివారణ చర్యలు చేపడుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమల్ భాషా, జిల్లా మలేరియా అధికారి సాంబమూర్తి, జోనల్ అధికారి ప్రసాద్, ఏఎంఒలు, సబ్ యూనిట్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# ఘనంగా మోదకొండమ్మ శాకాంబరీ ఉత్సవం

### ఆలయం వద్ద భారీగా అన్న సమారాధన

భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, నరసింగరావు

**ప్రజాశక్తి-పాడేరు:**పాడేరులో మోదకొండమ్మ అమ్మ వారి శాకాంబరి మహోత్సవం ఆదివారం అతి వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది ఆషాడ మాసంలో అమ్మవారికి శాకాంబరీ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.ఈ మేరకు పలు రకాల కూరగాయలతో అమ్మవారిని (శాఖములు) ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయమంతా ప్రత్యేక అలంకరణ చేశారు. శాకాంబరిగా అమ్మవారి దర్శనం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు పట్టణములోని భక్తులు పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో హాజరయ్యారు.ఆలయం వద్ద భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్పర్సన్, పాడేరు శాసన సభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్ తమర్బ నరసింగరావు, మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలం నాయుడు రమాదేవి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు.

# నేరాలు ఘోరాలు

## గంజాయి స్మగ్లర్ పట్టివేత

**ప్రజాశక్తి-పాడేరు:** ఇటీవల గంజాయి రవాణా చేస్తూ పాడేరు ఘాట్‌లో వాహనం ప్రమాదానికి గురి కావడంతో అక్కడే ఆ వాహనాన్ని, 400 కిలోల గంజాయిని వదిలిపెట్టి పరారైన గంజాయి స్మగ్లర్లను పోలీసులు పట్టుకున్నారు. గత నెల 25న పోతురాజు గుడి సమీపంలో ఆయిల్ ట్యాంకర్‌ను ఢీ కొట్టిన మహీంద్రా ఎక్స్ యువి 500 కారు, అందులో ఉన్న గంజాయిని పోలీసులు కనుగొన్న విషయం విధితమే. దీనిపై పాడేరు సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధాకర్ కేసు దర్యాప్తు చేపట్టి చాకచక్యంగా ఈ గంజాయి రవాణా చేస్తున్న స్మగ్లర్లను పట్టుకున్నారు. ఈ గంజాయి కేసుకు సంబంధించిన వివరాలు ఆదివారం పాడేరు సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధాకర్, సబ్ ఇన్స్పెక్టర్లు లక్ష్మణ్ విలేకరులకు వివరించారు. మహారాష్ట్రకు చెందిన ఫిరోజ్ అజీజ్ భగవస్ ఈ గంజాయి రవాణా చేసినట్లుగా గుర్తించి చాకచక్యంగా పట్టు పట్టుకున్నామన్నారు. ముంజంగిపుట్టు మండలం కుమ్మడ పంచాయతీ బందరుకూడా గ్రామానికి చెందిన మఠం సింహాద్రి గంజాయి సరఫరా చేసినట్లుగా గుర్తించారు. వీరిని అరెస్ట్ చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు.

## 22 కిలోల గంజాయి స్వాధీనం

**ప్రజాశక్తి-దేవరాపల్లి** : మండలంలోని శ్రీరాంపురం వై జంక్షన్‌లో శనివారం రాత్రి స్థానిక ఎస్ఐ డి.నాగేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీలో బైక్‌పై తెస్తున్న 22కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పి వి. సుబ్బరాజు తెలిపారు. పోలీసుల వాహన తనిఖీలను గమనించిన బైక్‌పైవస్తున్న ఇద్దరు వ్యక్తులు పారిపోయేందుకు యత్నించగా, పోలీసులు వెంబడించి ఒకరిని పట్టుకున్నారు. నిందితుడి నుంచి 22కిలోల గంజాయి, మోటార్ సైకిల్, రూ.6500 నగదును స్వాధీనం చేసుకుని ఆదివారం చోడవరం మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచామని, నిందితుడికి ఈనెల21 వరకు రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా అన్నానగర్ తెల్లమంగళం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఇక్కడ తక్కువ ధరకు దొరికే గంజాయిని కొనుగోలు చేసి, అక్కడ ఎక్కువరేటుకు అమ్మి, తక్కువ సమయంలో ఎక్కువ సంపాదన కోసం ఆశతో ఈ అక్రమానికి పాల్పడ్డారన్నారు. గడిచిన ఆరు నెలల కాల వ్యవధిలో 31 ఎన్‌డిపిఎస్ కేసులు నమోదు చేసి, 777 కేజీల గంజాయిని సీజ్ చేసి, 81 మందిని అరెస్టు చేశామని, ఇద్దరిపై పీడీ యాక్ట్ నమోదు చేశామన్నారు. గంజాయి అక్రమ రవాణాను అడ్డుకట్టవేసేందుకు ప్రత్యేక నిఘాపెట్టడంతోపాటు చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. యువత పెడదోవ పట్టి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. సిఐ ఎస్.తాతారావు ఎస్ఐ నాగేంద్ర ఉన్నారు.

# గీతం ప్రవేశాలకు అనూహ్య స్పందన

**ప్రజాశక్తి-మధురవాడ :** గీతమ్ డీమ్డ్ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన అడ్మిషన్ కౌన్సెలింగ్‌కు అనూహ్య స్పందన లభించింది. గీతంలో ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, లా, ఆర్కిటెక్చర్, మెడికల్, పారామెడికల్, ఫార్మశీ, నర్సింగ్, ఫిజియోథెరిపి తదితర వృత్తి విద్యాకోర్సులతో పాటు బిఎస్‌సి, బిఎ, బికామ్ డిగ్రీ కోర్సులకు ఈ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి హజరైన విద్యార్థులను, తల్లిదండ్రులను ఉద్దేశించి గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు ప్రసంగించారు. నూతన విద్యా విధానానికి అనుగుణంగా గీతం కోర్సులను రూపకల్పన చేయడంతో పాటు నిపుణులైన బోధన సిబ్బందిని నియమించామని తెలిపారు. ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించడానికి ఏటా రూ.50 కోట్ల స్కాలర్‌షిప్‌ల రూపంలో అందజేస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయంలో అధునాతన ప్రయోగశాలలతో పాటు రూ.100 కోట్లతో నూతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. విద్యార్థి గీతంలో ప్రవేశం పొందినప్పటి నుంచి డిగ్రీ అందుకుని వెళ్లేంతవరకు మార్గదర్శకం చేసేలా గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ ద్వారా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు వెల్లడించారు. విద్యార్థులలో స్టార్టప్ సంస్కృతిని పెంచడానికి వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. గీతం చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల చదువు గురించి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకునేలా విద్యార్థి హజరు, మార్కుల వివరాలు, హస్టల్‌లో వారు తీసుకునే ఆహారం వరకు పూర్తి సమాచారాన్ని గీతం వెబ్‌సైట్ ద్వారా తెలుసుకునే సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చేశామన్నారు. అధ్యాపకుల తరగతుల రికార్డింగ్ పాఠాలు, గీతం గ్రంథాలయంలోని ఈ-రిసోర్సెస్‌ను ఇంటి నుంచి, వసతి గృహాల నుంచి చదివే వీలు కల్పిస్తున్నామన్నారు. గీతం ఎక్స్‌టర్నల్ రిలేషన్స్ డిప్యూటీ డైరక్టర్ నవీన్ మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా లక్ష మంది పైగా గీతం పూర్వ విద్యార్థులు కీలక పదవులలో ఉన్నారని ప్రస్తుత విద్యార్థులకు మార్గదర్శకం చేయడానికి వారి సహకారం తీసుకుంటున్నామన్నారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ అడ్మిషన్ల విభాగం అధికారులు, సీనియర్ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆదివారం జరిగిన కౌన్సెలింగ్‌లో ఇంటర్మీడియట్ తత్సమాన కోర్సులు పూర్తిచేసిన వారికి బిఎస్సీ బయోటెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, స్టాటస్టిక్స్, బిసిఎ, ఫిజియోథెరిపి, బిఫార్మశీతో పాటు బిఎ ఎల్ఎల్‌బి, బిబిఎ, బిఎలో ఎకనామిక్స్, హిస్టరీ, ఇంగ్లీష్, పొలిటికల్ సైన్స్, సోషియాలజి కోర్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. వీటితో పాటు పారా మెడికల్ కోర్సులైన ఆప్టోమెట్రి, మెడికల్ ల్యాబ్‌టెక్నాలజీ, ఎమర్జెన్సి మెడికల్ టెక్నాలజీ, రీనల్ డయాలసిస్ టెక్నాలజీ కోర్సులకు ప్రవేశాలు కల్పించారు. డిగ్రీ తత్సమాన అర్హత గల వారికి ఎమ్మెస్సీ డేటా సైన్స్, బయోటెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైక్రోబయాలజీ, కెమిస్ట్రీ కోర్సులలో ప్రవేశం కల్పించారు.

అడ్మిషన్ల కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

## అన్నవరంలో ఒబెరాయ్ లగ్జరీ రిసార్ట్స్‌కు శంకుస్థాపన

**ప్రజాశక్తి - భీమునిపట్నం :** మండలంలోని అన్నవరం గ్రామంలో ఒబెరాయ్ హోటల్ గ్రూప్ ఏడు నక్షత్రాల సదుపాయాలతో నిర్మిస్తున్న లగ్జరీ రిసార్ట్స్‌కు సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. కడప జిల్లా గండికోట నుంచి ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పర్యాటక అభివృద్ధి, ప్రోత్సాహంలో భాగంగా తలపెట్టిన ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం తరుపున పూర్తి సహాయ సహకారాలు అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆయన ఆదేశించారు. అనంతరం అన్నవరంలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ రూ.350 కోట్లు ఖర్చుతో నలభై ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఒబెరాయ్ రిసార్ట్స్ ఈ ప్రాంత అభివృద్ధిలో భాగమౌతుందన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఎనిమిది కిలోమీటర్లు, ప్రతిపాదిత బీచ్ కారిడార్‌కు 150 మీటర్ల దూరంలో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టులో భాగంగా ఏడు నక్షత్రాలు సదుపాయాలతో 300 విల్లాస్ నిర్మిస్తారని, తద్వారా 5500 మందికి ఉపాధి లభిస్తుందని, ఈ ప్రాజెక్టు నాలుగు సంవత్సరాల్లో పూర్తవుతుందని తెలిపారు. భీమిలి శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు నెలల కాలంలోనే తన నియోజకవర్గానికి మూడు ప్రాజెక్టులు మంజూరు చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఒబెరాయ్ గ్రూపు రిసార్ట్స్ ప్రాజెక్టుకు జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, శాసనమండలి సభ్యురాలు వరుదు కల్యాణి, శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రెవిన్యూ డివిజన్ అధికారి హుస్సేన్ సాహెబ్, పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు ఫణి శ్రీనివాస్, ఎంపిపి డి.వాసురాజు, జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, అన్నవరం సర్పంచ్ ఎం.సంతోషి, ఎంపిటిసి సభ్యులు ఎస్.దుర్గాలమ్మ, వైస్ ఎంపిపి బోని బంగారు నాయుడు, తహశీల్దార్ కోరాడ వేణు గోపాల్, ఎంపిడిఒ వెంకటరమణ పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో 17 మంది జూదరులు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రీన్‌పార్క్ హోటల్ దగ్గర ఉన్న శ్రీనివాస అపార్ట్‌మెంట్‌లోని ఓ గదిలో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఆదివారం పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ ఎ.త్రినాథరావు ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. పదిహేడు మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.లక్షా 61 వేలా 60 నగదును, 18 మొబైళ్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల కోసం టూ టౌన్ పోలీసులకు నిందితులను అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

## యుటిఐ - 4 లీగ్ అంపైర్‌గా డాక్టర్ డివిఎస్‌వై.శర్మ

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** విశాఖపట్నంలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డివిజనల్ ఆఫీసులో హెచ్‌జిఎగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ డివిఎస్‌వై.శర్మ ఈ నెల 13 నుంచి 30 వరకు మహారాష్ట్రలోని పూణేలో జరగనున్న అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ లీగ్ సీజన్ - 4కు అంపైర్‌గా ఎన్నికయ్యారు. యూటిఐ - 4 లీగ్ పూణేలోని బలివాడి ఇండోర్ స్టేడియంలో జరుగనుందని, ఆరు జట్లు పాల్గొంటాయని, ఈ పోటీలు 11 స్పోర్ట్స్ ఆధ్వర్యంలో టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకంలో జరగనున్నాయని 'ప్రజాశక్తి'కి శర్మ తెలిపారు. ఆరు జట్ల మధ్య మొత్తం 18 మ్యాచ్‌లు జరుగుతాయని, వీటిని ప్రతిరోజు రాత్రి 7:30 గంటల నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో లైవ్ ప్రసారం చేస్తారని వెల్లడించారు.

# కొత్త యూనిట్లు ఏర్పాటుకు కృషి

### కంపెనీలకు నిరంతర సహకారం
### 'ప్రజాశక్తి'తో వి సెజ్ డవలప్‌మెంట్ కమిషనర్ ముప్పాల శ్రీనివాస్

**ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)**

'సెజ్‌లో కొత్త యూనిట్లు ఏర్పాటు చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నాం. కంపెనీ ఏర్పాటుకు తలెత్తుతున్న అడ్డంకులను తొలగించడానికి మా వంతు ప్రయత్నాలు చేస్తున్నాం. ఎగుమతులు, దిగుమతులకు సంబంధించిన వ్యవహారాలను చక్కదిద్దేందుకు కస్టమ్స్ అధికారులకు సహకరిస్తున్నాం. సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ సెజ్ అభివృద్ధికి కృషి చేస్తున్నాం' అని వి సెజ్ డవలప్‌మెంట్ కమిషనర్ ముప్పాల శ్రీనివాస్ తెలిపారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

**ప్రస్తుతం వి సెజ్‌లో ఎన్ని కంపెనీలు ఉన్నాయి ? ఎంత మంది ఉపాధి పొందుతున్నారు ?**

ప్రస్తుతం వి సెజ్‌లో 52 వర్కింగ్ యూనిట్లు ఉన్నాయి. వీటిలో ఐదు వేల మంది ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్నారు. స్థానికంగా ఐదు ఫార్మా యూనిట్లు ఉన్నాయి. కొన్ని యూనిట్లు కరోనా విపత్కర కాలంలో కొన్ని మందులు, వ్యాక్సిన్లు తయారు చేశాయి. స్థానికంగా సరఫరా చేయడం ద్వారా ప్రజలకు మేలు జరిగింది.

**గత ఏడాది నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను చేరుకున్నారా ?**

2021-22లో రూ.1,35,498 కోట్ల ఎగుమతులతో పోలిస్తే,. 2022 -23 సంవత్సరానికి రూ.1,65,000 కోట్లతో లక్ష్యాన్ని అధిగమించి ఎగుమతులు చేశాం. 33 శాతం వృద్ధి నమోదైంది. ఎగుమతులు పెంచడానికి, ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేయడానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం.

**సెజ్‌లో మహిళలకు ఎలాంటి ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయి?**

ఇక్కడ స్త్రీ, పురుషులిద్దరికీ సమాన అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. కంపెనీలు ఇరువురినీ నియమించుకుంటున్నాయి. వాస్తవానికి కొన్నిచోట్ల పురుషుల కంటే ఎక్కువ సంఖ్యలో మహిళలే పనిచేస్తున్నారు. వారికి ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నాం. రవాణా, వైద్యం, భద్రత, సంక్షేమం, క్యాంటీన్ విషయాలతో పాటు తరుచూ వైద్య శిబిరాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

**యూనిట్ల ద్వారా మొత్తం ఉత్పత్తిలో ఎంత శాతం ఎగుమతి చేయబడుతుంది ?**

ఉత్పత్తిలో ఎక్కువ భాగం ఎగుమతి చేయబడుతుంది. దాదాపు 70-80 శాతం ఎగుమతి జరుగుతుంది. ఏ యూనిట్ స్థానిక మార్కెట్‌లో అమ్ముకోవడానికి ఆసక్తి చూపదు. ఇక్కడ ఉత్పత్తి చేసిన వాటిని అమ్ముకోవడానికి వివిధ రకాల ట్యాక్సులు చెల్లించాల్సి ఉంది.

**యువతకు ఉపాధి అవకాశాలు ఎలా ఉన్నాయి ?**

వి సెజ్‌లో ఏర్పాటు చేసిన యూనిట్లు యువతకు ఉపాధి కల్పిస్తాయి. పరిశ్రమల అవసరాలను బట్టి యువతకు శిక్షణ ఇవ్వడానికి, వారిని కంపెనీల్లోకి తీసుకోవడానికి, పారిశ్రామికంగా సిద్ధం చేయడానికి ప్రభుత్వాలు నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయి.

**ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలేంటి ?**

కొన్నేళ్లుగా పెద్ద ప్రమాదాలేవీ జరగలేదు. ప్రమాద రహిత ప్రాంతంగానే వి సెజ్ ఉంది. అయినప్పటికీ ప్రమాదాలు జరగకుండా అన్ని యూనిట్లూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నాయి. కొన్ని ప్రధాన యూనిట్లు అగ్నిమాపక వ్యవస్థ, అగ్నిమాపక యంత్రాలు, ఇసుక బకెట్లు మొదలైన వాటిని ఏర్పాటు చేసుకున్నాయి. మేమూ అప్రమత్తంగా ఉంటున్నాం.

**ఏయే కంపెనీలు రాబోతున్నాయి ?**

విసెజ్‌లో యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి రెండు, మూడు ప్రతిపాదనలు వచ్చాయి. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన చివరి యూనిట్ అప్రూవల్ కమిటీ సమావేశంలో దాదాపు మూడు యూనిట్లు ఆమోదించబడ్డాయి. మొత్తం రూ.1191.78 లక్షల పెట్టుబడితో 824 మందికి ఉపాధి అవకాశాలను కల్పించే అవకాశముంది.

**ఎదురవుతున్న సవాళ్లేంటి ?**

వర్క్ ఫ్రమ్ హోమ్ విధానం కారణంగా సాఫ్ట్‌వేర్ కంపెనీలు సెజ్‌లలో కంపెనీలు ఏర్పాటు చేయడం సవాలుగా మారింది. తద్వారా డెవలపర్లు సమస్యలను ఎదుర్కొంటున్నారు. సంక్షోభాన్ని అధిగమించడానికి వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ నుంచి కొన్ని మంచి విధాన నిర్ణయాలు త్వరలో వెలువడే అవకాశం ఉంది.

# భళా.. సత్యభామ నృత్యోత్సవం

### పలువురికి అవార్డుల ప్రదానం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యాన కళాభారతి ఆడిటోరియంలో తొమ్మిదోసారి అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న సత్యభామ యువ నృత్యోత్సవ్ రెండోరోజైన ఆదివారం రాత్రి అంగరంగవైభవంగా ముగిసింది. ప్రపంచం నలు మూలాల నుంచి ఈ ఉత్సవంలో పాల్గొన్న వారు భారతీయ సంప్రదాయ నాట్యకళా ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరింపజేశారు. వీక్షకుల హర్షధ్వానాల మధ్య కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కూచిపూడి సిద్ధేంద్రయోగి కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రికి నిర్వాహకుల తరపున ముఖ్య అతిథి ఆదాయపన్నుల శాఖ కమిషనర్ ఎస్.రవిశంకర్ నారాయణ్, గౌరవ అతిథి అనకాపల్లి పోలీస్ సూపరింటెండెంట్ కెవి.మురళి, ఫెస్టివల్ డైరెక్టర్, ద డ్యాన్స్ ఇండియా ఎడిటర్ బత్తిన రంగ విక్రమ్ కుమార్ గౌడ్, విశిష్ట అతిథులు సాయి వెంకటేష్, జగబంధు జెనా చేతుల మీదుగా పద్మశ్రీ డాక్టర్ కె.శోభానాయుడు ఎక్సలెన్స్ అవార్డు-2023ను ప్రదానం చేశారు. విశాఖకు చెందిన ప్రముఖ కూచిపూడి నర్తకి సూడగాని గీతా నారాయణ్ సత్యభామ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. కేరళకు చెందిన ప్రఖ్యాత మోహినీయాట్టం కళాకారిణి చిత్ర సుకుమారన్ జ్యూరీ ప్రత్యేక పురస్కారాన్ని అందుకున్నారు. రెండో రోజు ఉత్సవ ప్రదర్శనలలో భాగంగా ప్రముఖ కూచిపూడి నర్తకి సూడగాని గీతా నారాయణ్ నాట్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## రుషికొండ బీచ్‌కు ప్రవేశ రుసుం రద్దు చేయాలని ధర్నా

**ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)**

రుషికొండ బీచ్‌లో ప్రవేశానికి రుసుం వసూలు చేయాలని పర్యాటక అభివృద్ధి సంస్థ నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తూ సిఐటియు విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జగదాంబ సెంటర్‌లో ఆదివారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ వ్యక్తి ప్రవేశానికి రూ.20, పార్కింగ్ ఫీజుల కింద ద్విచక్ర వాహనానికి రూ.10, కారుకు రూ.30, బస్సుకు రూ.50, స్నానాలు చేసి బట్టలు మార్చుకున్నందుకు రూ.30 వసూలు చేయాలని నిర్ణయించడం దారుణమన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి దుర్మార్గ పాలన సాగుతోందని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా బీచ్‌లకు ప్రవేశ రుసుం పెట్టడం దుర్మార్గమన్నారు. ఎంతో పేరు ప్రఖ్యాతలుగాంచిన గోవా బీచ్‌కుగానీ, మద్రాస్ మెరీనా బీచ్‌కుగానీ ఎటువంటి ప్రవేశ రుసుములూ లేని విషయాన్ని గుర్తు చేశారు. కొత్తగా మన రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇటువంటి ప్రతిపాదన చేయడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికే ప్రజల మీద ఇంటి, చెత్త పన్నులు, విద్యుత్ ఛార్జీలను విపరీతంగా పెంచి నడ్డి విరిస్తున్నారన్నారు. ఎంవిపి.కాలనీలోగల హెల్త్ ఎరీనాలో వాకర్స్ నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని, కొత్తగా నిర్మించిన ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రైవేటు వారికి ఇచ్చి విపరీతంగా డబ్బులు తీసుకుంటున్నారని విమర్శించారు. ప్రజల డబ్బుతో నిర్మించిన వాటిని ప్రైవేటు వాళ్లకి కట్టబెట్టి తిరిగి ప్రజల నుంచి డబ్బులు వసూలు చేయడం ఏంటని ప్రశ్నించారు. తక్షణమే రుషికొండ బీచ్‌కు ప్రవేశ రుసుం, పార్కింగ్ ఫీజులు వసూలు చేయాలనే ప్రతిపాదనను విరమించాలని, లేకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా మారిందన్నారు. రుషికొండ బీచ్‌కు ప్రవేశ రుసుం విషయంపై రాష్ట్ర మంత్రి అమర్‌నాథ్ స్పందిస్తూ ఇది ప్రతిపాదన మాత్రమేనని, దీన్ని తాత్కాలికంగా ఉపసంహరించుకుంటామని, ప్రభుత్వమే ఆ భారాన్ని భరిస్తుందని చెప్పడం చూస్తుంటే తర్వాత కాలంలోనైనా మొత్తం బీచ్‌లన్నింటికీ చుట్టూ గోడలు గట్టి, గేట్లు పెట్టి, గంటల వారీగా రేట్లు నిర్ణయించి వసూలు చేయడానికి సిద్ధపడినట్టు అనిపిస్తోందన్నారు. ఇటువంటి నిర్ణయాలను, ఆలోచనలను ప్రజలు ఏమాత్రమూ అంగీకరించబోరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.సుబ్బారావు, పి.మణి, కెవిపి.చంద్రమౌళి, ఎ.సీతాలక్ష్మి, ఎం.సూరీడు, పైడిరాజు, కె.చంద్రశేఖర్, పిఎస్.నారాయణ, ప్రసాద్, రామారావు, కుమార్, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

### ప్రవేశ రుసుం లేదు : మంత్రి అమర్‌నాథ్

**ఎంవిపి.కాలనీ :** రుషికొండ బీచ్‌లో ప్రవేశానికి రుసుం వసూలు చేయనున్నారని వస్తున్న వార్తల్లో నిజం లేదని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రుషికొండ బీచ్‌కు బ్లూ స్టార్ హోదా లభించిన నేపథ్యంలో నిబంధనల ప్రకారం ఆ బీచ్‌లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రుసుము వసూలు చేయాలని కేంద్రం పేర్కొందని తెలిపారు. అయితే, బీచ్‌లో ప్రవేశానికి ప్రజలు ఎటువంటి రుసుమూ చెల్లించాల్సిన అవసరం లేదని, సదుపాయాలు కల్పించే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు.

## శిష్ట కరణాలను ఒబిసి జాబితాలో చేర్చాలి

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** శిష్టకరణాలను ఒబిసి జాబితాలో చేర్చాలని కోరుతూ శిష్టకరణ సాధన సమితి నాయకులు ఎన్.గజపతిరావు ఆధ్వర్యంలో సుమారు 200 మంది శిష్టకరణ సభ్యులు ఆదివారం లాసన్స్ బే కాలనీలోని బిజెపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావును కోరారు. కార్యక్రమంలో సంఘం జాతీయ అధ్యక్షులు బెనర్జీ, ప్రధాన కార్యదర్శి కెఎ.ప్రకాష్, విశాఖపట్నం జిల్లా ప్రధాన కార్యదర్శి మంత్రి నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ వెల్ఫేర్ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కిషోర్ పాల్గొన్నారు.

## రైల్వే సముదాయాలలో డిఆర్ఎం ఆకస్మిక తనిఖీలు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** వాల్తేర్ డివిజన్ డిఆర్ఎం అనూప్ సత్పతి రైలు కార్యకలాపాల భద్రతను నిర్ధారించడం, వివిధ ప్రదేశాలలో, లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద పనిచేసే సిబ్బంది పనితీరుపై దృష్టి పెట్టి శనివారం అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పెందుర్తి, సింహాచలం నార్త్, మార్షలింగ్ యార్డ్, విశాఖపట్నం స్టేషన్లలో ఆయన పర్యటించారు. సిబ్బంది లాబీలను పరిశీలించారు. ఆయన వెంట సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ మోహిన్ష్ బ్రహ్మా, అసిస్టెంట్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ (ఆపరేషన్స్) ఎస్‌కె.బలియార్ సింగ్ ఉన్నారు.